క్లుప్తంగా

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఉదయం వైభవంగా జరిపించారు. వేదపండితుల నిర్ణయించిన ముహూర్తాన స్వామివారి బింబ, ఆలయశిఖరం, జీవధ్వజదండ ప్రతిష్టించారు. ఆలయం వద్ద ధ్వజస్తంబం ప్రతిష్టిస్తుండగా భక్తులు స్వామివారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిష్ట అనంతరం లోకకల్యాణం, గ్రామ శ్రేయస్సు కోసం విశేషపూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి విశేషపూజల్లో పాల్గొన్నారు. పలుగ్రామాల నుంచి తరలివచ్చిన విశేష అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సత్తెనపల్లి తహసీల్దార్‌గా సురేష్



సత్తెనపల్లి: సత్తెనపల్లి తహసీల్దార్‌గా ఎస్.సురేష్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నకరికల్లు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్ గా పని చేస్తున్న కె.నగేష్‌ను మాచవరంకు బదిలీ చేశారు.

వలంటీర్ల సేవలకు వందనం

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలో 13వ సచివాలయం వలంటీర్లు అందించిన సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రకటించిన సేవరత్న, సేవ మిత్ర పురస్కారాలను బుధవారం అందించారు. 13వ వార్డు కౌన్సిలర్ బండి రాజ్యలక్ష్మి మల్లికార్జున రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ గడ్డం శ్రీలత వెంకటేశ్వర్లు (బుల్లోడు), మున్సిపల్ రెవెన్యూ అధికారి అప్పారావులు ముఖ్య అతిథులుగా హాజరై వలంటీర్ల సేవలను కొనియాడారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కౌలు కార్డులు ఇవ్వాలని వినతి

ముప్పాళ్ల: ప్రతి కౌలు రైతుకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటు పల్లిబాలకృష్ణ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో కౌలు రైతు సమస్యలపై పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ సచివాలయంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ద్వారా కౌలు రైతులను గుర్తించి భూయజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తున్న విధానంగానే ఓసీ రైతులకు ఇవ్వాలన్నారు. కౌలు రైతుసంఘం మండల నాయకులు తొరటిఅమరలింగేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు. కౌలు రైతు సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర జాత ఈ నెల 9వ తేదీన చేరుకుంటుందని కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు మారూరి జగన్మోహనరెడ్డి పాల్గొన్నారు.

నండూరి కరుణకుమార్‌కు అరుదైన గుర్తింపు

అమరావతి: నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధిగా పని చేస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అమరావతి వాసి నండూరి కరుణ కుమార్‌కు ప్రపంచ మానవహక్కుల రక్షణ కమిషన్ సభ్యత్వం వంటి అరుదైన గుర్తింపు లభించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారత్ ప్రభుత్వం గుర్తింపు పొందిన అమెరికాలోని న్యూయార్క్ కేంద్రంగా చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ప్రపంచ మానవహక్కుల రక్షణ కమిషన్ సంస్థ ఈనెల 4వతేదీన ఢిల్లీ విజ్ఞానభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నండూరి కరుణకుమార్‌కు ప్రపంచ మానవహక్కుల రక్షణ కమిషన్ సభ్యత్వంతో పాటుగా ఉత్తమసామాజిక సేవక పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా బుధవారం ప్రపంచ మానవహక్కుల రక్షణ కమిషన్ సభ్యత్వంతో పాటుగా ఉత్తమ సామాజిక సేవక పురస్కారాన్ని పొందిన నండూరి కరుణ కుమార్‌ను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, సామాజిక సేవాసంస్థల ప్రతినిధులు అభినందించారు.

నేడు పెదపాలెంలో ప్రతిష్ట మహోత్సవాలు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో దేవతామూర్తుల ప్రతిష్ట మహోత్సవాలు గురువారం ఉదయం 7.42 గంటలకు జరగనున్నాయి. శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివార్ల ప్రతిష్ఠలతోపాటు గ్రామదేవతలు, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సహిత అష్టనాగమానసాదేవి, నాభిశిల, నవగ్రహ, జీవ ధ్వజ ప్రతిష్టమహోత్సవాలు జరుగనున్నాయి. శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు, భారత ధర్మదేవత బిరుదాంకితులు పరిమపూజ్య శివస్వామివారు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా యంత్ర, బింబస్థాపన, అష్టబంధనం, అష్టబంధన హోమం, ప్రాణ ప్రతిష్ట, హోమములు, ప్రతిష్ట హోమాలు, అఘోర హోమాలు, జయాది హోమాలు, క్షేత్రపాల బలిదానము, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకము, శాంతి కల్యాణము మొదలగు కార్యక్రమాలు జరుగనున్నాయి. మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమము జరగనుంది. భక్తులు సకాలంలో వచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసినదిగా నిర్వాహకులు కోరారు.

‘ఉపాధి’తో జలసంరక్షణ

- నేల బావులు తవ్వకానికి అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



వెన్నాదేవిలో గల నేలబావి

సత్తెనపల్లి: జలసంరక్షణలో భాగంగా భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నేలబావులు తవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే నీటి కుంటల తవ్వకం, చెరువులు లోతు చేయడంతో పాటు గట్లు పటిష్టపరిచారు. వీటితో పాటు వర్షం నీరు వృథాగా బయటకు పోకుండా భూమిలో ఇంకిపోవడానికి నేల బావులు తవ్వాలని ప్రభుత్వం భావించింది. దీనికి నిధుల మంజూరుకు కూడా అనుమతి ఇచ్చింది. సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ వేతనదారులతో నేల బావులు తవ్వుకోవడానికి అనుమతి ఇచ్చింది. ముందుకు వచ్చిన రైతులకు బావులు మంజూరు చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు పడకముందే వీటిని తవ్వించాలని నిర్ణయించారు. గతంలో పొలాల్లో ఎక్కువగా ఈ బావులు ఉండేవి .. వాటితో కూరగాయలు, అపరాలు, చిరుధాన్యాలు పండించే వారు. అవి ప్రస్తుతం కనుమరుగయ్యాయి. మళ్లీ కొత్తగా తవ్వించాలని .. దానికి అవసరమైనన్ని ఉపాధిహామీ నిధులు కేటాయించాలని భావించారు.

రైతులు వినియోగించుకోవచ్చు ....

వర్షం నీరు వృథాగా బయటకు పోకుండా . ఒకే చోట నిల్వ చేయడానికి నేలబావులు తవ్వాలని నిర్ణయించారు. వాటిలో చేరిన నీరు అవసరమైనప్పుడు పొలాలకు తోడు కోవడానికి రైతులు ఉపయోగించుకోవచ్చు. అందుకు ప్రతి పంచాయతీలో నేలబావులను వేతనదారులతో తవ్వించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

20 – 30 అడుగుల లోతుల్లో ...

నేల బావులు 20 నుంచి 30 అడుగుల లోతులో తవ్వించాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. రైతు అనుమతితో ఉపాధి వేతనదారులతో వీటిని తవ్విస్తారు. ఒక్కో బావికి రూ. 2.60 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు మంజూరు చేస్తారు. ముందు రైతుకు సంబంధించిన అనుమతిని లిఖిత పూర్వకంగా తీసుకుని భూమి సర్వే నెంబరు , వివరాల పత్రాలు సేకరిస్తారు. అవన్నీ పూర్తయిన తరువాత నేల బావి తవ్వడానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. మండలాల ఆధారంగా లక్ష్యాలు నిర్దేశించనున్నారు. ఆసక్తి కలిగిన రైతులు ముందుకు వస్తే ఎన్ని నేల బావులైనా మంజూరు చేస్తామంటున్నారు.

మెట్టభూములకు ప్రాధాన్యం...

నేల బావులు తవ్వకానికి జిల్లా వ్యాప్తంగా అన్ని క్లస్టర్లలో ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ప్రధానంగా మెట్ట భూముల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారు. పండ్ల తోటల్లో నేలబావులు తవ్వాలని నిర్ణయించారు. రైతులకు ఇవి ఎంతో ప్రయోజనకరం. బావిలో చేరిన నీరు వేసవిలో తోటలకు పోయడానికి ఉపయోగ పడతాయి. దీని వల్ల భూమిలో నీటి మట్టం పెరుగుతుందని డ్వామా అధికారులు అంటున్నారు.

నీటి సంరక్షణకు నేల బావులు

నీటి సంరక్షణలో భాగంగా నేల బావులు ప్రతి గ్రామంలో తవ్వాలని భావించాం. ప్రస్తుతం ఈ పనులను గుర్తించే పనిలో మండల స్థాయి ఉపాధి పథకం అధికారులున్నారు. గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ముందుకు వస్తే వీటిని మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. వర్షాలు పడకముందే ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం.

–పీ.వెంకటనారాయణ,
ఇన్‌చార్జ్ ఏపీడీ, సత్తెనపల్లి

ఘనంగా లయన్స్ క్లబ్ 107వ ఆవిర్భావ దినోత్సవం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సత్తెనపల్లి: అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు లయన్ తవిటి భావన్నారాయణ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. భావన్నారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్న అగ్రశ్రేణి సేవా సంస్థల్లో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని, అటువంటి సంస్థ శాఖకు అధ్యక్షునిగా పని చేయడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ వల్లూరి శ్రీనివాసరావు, లయన్ మంచికంటి వెంకటేశ్వర రావు, లయన్ తోట సాంబశివయ్య, లయన్ కంబాల వెంకటేశ్వరరావు, లయన్ కోట వెంకటేశ్వర్లు, లయన్ పెద్దింటి వెంకటేశ్వర్లు, లయన్ పొత్తూరి రామకోటయ్య, లయన్ కొప్పురావూరి రాజశేఖర్, లయన్ తిరుమల సాంబ శివరావు, లయన్ వి.వి.ఆర్. కృష్ణమాచార్యులు, ఆశ్రమ నిర్వాహకురాలు రిషిత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో లక్ష్యాలు అధిగమించాలి

జిల్లా పరిషత్ సీఈఓ మోహన్ రావు



ఉపాధి పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహన్‌కుమార్

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఉపాధి కల్పనలో లక్ష్యాలు అధిగమించాలని జిల్లా పరిషత్ సీఈఓ మోహన్‌రావు చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గండ్లూరు గ్రామంలో బ్లాక్ పరిధిలో రూ.7.50 లక్షలతో చేపడుతున్న 12 కాలవుల నిర్మాణ పనులు బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం హార్టికల్చర్‌లో భాగంగా సీతాఫలం తోటను, రోడ్ సైడ్ మొక్కల పెంపకాన్ని పరిశీలించి కూలీలతో మాట్లాడారు. 220 మంది కూలీలు పనులకు హాజరు కావడంతో ఉపాధి హామీ పథకంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తమకు ఎలాంటి సమస్యలు లేవని ఇప్పటికే 70, 80 రోజుల పని కాలం పూర్తి చేసినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో వీధి దీపాలు, మంచినీటి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఏపీడీ పీ.వెంకట నారాయణ, సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ రషీద్, తదితరులు ఉన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇన్‌చార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకన్నా అధిక ధరలకు పత్తి, మిరప విత్తనాలు విక్రయించినట్లయితే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు యస్ శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలను బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన షాపు యజమానులు తప్పకుండా స్టాక్, ధరలు తెలిసే విధంగా షాపులో బోర్డులు డిస్‌ప్లే ప్రదర్శించాలన్నారు. సోర్స్ సర్టిఫికెట్ వాలిడిటీ ఉన్న అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. డీలర్లు రైతులకు కావలసిన కొన్ని ప్రత్యేక రకాలైన ప్రత్తి, మిరప విత్తనాలు విషయంలో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినట్టైతే అటు వంటి డీలర్లు పై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తనాలు కొన్న ప్రతీ రైతుకు బిల్లులో లాట్ నెంబర్, కంపెనీ, రకం మొదలైన వివరాలు సరిగ్గా నమోదు చేసి, డీలర్, రైతుసంతకంతో కూడిన బిల్ రైతులకు ఇవ్వాల న్నారు. రైతులు కూడా లైసెన్సు ఉన్న డీలరు వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, బిల్లు పంట కాలం పూర్తి అయ్యేంత వరకు జాగ్రత్తగా పెట్టు కోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తాగునీటి కుళాయి ఏర్పాటు



తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న రాఘవరెడ్డి

నకరికల్లు: ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రజల దాహార్తిని వైఎస్సార్ సీపీ హయాంలో తీర్చామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక బుడగజంగాల కాలనీలో రూ.9.80 లక్షలతో, యాసంబజారు ముస్లిం వీధిలో రూ.3.60 లక్షలతో నూతనంగా తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా రెండుప్రాంతాల వాళ్లు కిలోమీటర్ల దూరం నడిచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉందన్నారు. వారి సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మైనారిటీ, ఎస్టీ వర్గాలకు మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తాగునీటి వసతుల కల్పన, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ఆయాకాలనీల వాసులు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డిని, వైస్‌ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బి బాషాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీ బాషా, పరసా పెద్దబ్బాయి, మార్నెళ్ల శ్రీనివాసరావు, శాగం చంద్రశేఖర్ రెడ్డి, సలీల్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రుసుం శ్రీనివాసరావు, గ్రామ కారదర్శి అరుణప్రియ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి



సత్తెనపల్లి: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మాస్టిన్ పేటలో బాల కార్మికవ్యవస్థ అరికట్టేందుకు బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాది కోటగిరి లక్ష్మణ్, కార్మిక శాఖ అధికారి మూర్తి, ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, మహిళా పోలీస్ ఎస్.విజయలక్ష్మి, ఏ.ఎన్.ఎమ్ లీలా కుమారి,శానిటేషన్ కార్యదర్శి సరిత, ఆశా కార్యకర్త ఆర్.శ్రీదేవి, పారా లీగల్ వాలంటీర్లు షేక్ ఖాజా, షేక్ ముబారక్ లు పాల్గొన్నారు.

హిందూమతాన్ని రక్షించాలి

శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి



అచ్చంపేట: హిందూమతాన్ని పరిరక్షించాలని, దేవాలయాలను, విగ్రహాలను ధ్వంసంచేసే దుష్ట శక్తులపై చర్యలు తీసుకోవాలని శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామి కోరారు. స్థానిక అభయాంజనేయస్వామివారి విగ్రహం ముందుగల స్వామివారి వాహనమైన ఒంటె విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని అరెస్ట్ చేయాలని కోరుతూ బుధవారం స్వామివారి విగ్రహం వద్ద శ్రీషిరిడి సాయి భక్తసమాజం వారు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కొంతమంది సంఘ విద్రోహ శక్తులు మతకల్లోలు సృష్టించడానికి, హిందూమతాన్ని కించపరచే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఘటన జరిగి మూడు రోజులైనా ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మూడు రోజులలో బాధ్యలను అరెస్ట్ చేస్తానని ఎస్ఐ కె.పాల్ రవీంద్ర హామీ ఇచ్చిన మీదట దర్నా విరమించారు. స్వామిజీ శిష్యబృంద సభ్యులు, స్థానిక శ్రీషిరిడిసాయి, సీతారామస్వామి, అయ్యప్పస్వామి భక్త సమాజం వారు పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక అభయాంజనేయ స్వామివారి విగ్రహం ముందుగల స్వామివారి వాహనమైన ఒంటె విగ్రహాన్ని ధ్వసం చేసినవారిని అరెస్ట్ చేయాలని కోరుతూ బుధవారం స్వామివారి వగ్రహం వద్ద శ్రీషిరిడిసాయి భక్తసమాజం వారు కొద్దిసేపు ధర్నా చేశారు. కొంతమంది సంఘవిద్రోహ శక్తుల మతకల్లోలు సృష్టించడానికి, హిందూమతాన్ని కించపరచే విధంగా పవిత్రమైన ఒంటె వాహనాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు.

అగ్నిప్రమాదంలో మూడెకరాల జామతోట దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన జామ తోటను పరిశీలించిన ఎస్ఐ మహబూబ్ సుభాని

క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామంలో సింగడి సత్యనారాయణకు చెందిన జామతోట అగ్నిప్రమాదం సంభవించి తలగబడింది. ఎస్ఐ మహబూబ్ సుభాని తెలిపిన వివరాల మేరకు సత్యనారాయణకు ఆరు ఎకరాల జామ తోట ఉంది. అయితే పక్క పొలం రైతు తన పొలంలో ఉన్న గట్లు మీది గడ్డి, మొక్కజొన్న గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు సత్యనారాయణ జామతోటకు విస్తరించి మూడెకరాల జామతోట అగ్నికి ఆహుతైంది. నాలుగులక్షల విలువైన పంట కాలిబూడిదయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తపరిచారు. పక్కపొలం రైతు శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపాడు.

ముస్లిం మైనారిటీలకు అండగా వైఎస్ కుటుంబం



పట్టణంలోని మసీద్‌లో సామూహిక నమాజులో మంత్రి అంబటి రాంబాబు

- మంత్రి అంబటి రాంబాబు
- రూ.9.40 కోట్ల విలువైన స్థలం మస్జీద్‌కు కేటాయింపు
- రూ.74 లక్షలతో ఈద్గా అభివృద్ధికి కృషి

సత్తెనపల్లి: ముస్లిం మైనారిటీలకు వైఎస్ కుటుంబం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలోని మసీదు బంగ్లాకు రూ. 9.40 కోట్ల విలువైన 20 సెట్ల స్థలాన్ని ఇది అల్లా సంకల్పంతో అందిస్తున్నట్లు భావిస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ఎస్ఎస్పీ విశ్రాంత భవన ప్రాంగణంలోని బంగ్లా మసీదుకు ప్రభుత్వం స్థలం మంజూరు వేయడంపై ముస్లిం సామాజిక వర్గాలు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ షేక్ నాగూర్ మీరాన్ అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ పిడుగురాళ్ల మార్గంలో ఉన్న ఈద్గా అభివృద్ధికి రూ.74 లక్షలతో అంచనాలు తయారు చేశామని, నిధుల మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగా కొండమోడు, గుళ్లపల్లి గ్రామాల్లో షాదీఖానాలు నిర్మించి ఈ ప్రభుత్వం ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాలకు అండగా ఉందని మరోసారి నిరూపిస్తామన్నారు. మీ అందరి సహకారంతో ఎక్కడ దాకా అయినా వెళ్తానని, సత్తెనపల్లే నా చివరి మజిలీ అని గుర్తు చేశారు. ముందుగా మసీదులో ప్రత్యేక నమాజులు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబును పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమం లో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారా యణ, పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, ముస్లింమతపెద్ద న్యామతుల్లా, పట్టణ మత పెద్దలు ఎంజే మౌలాల్లి, పెద్ద షరీఫ్, పెద్ద నన్నే,కౌన్సిలర్ సయ్యద్ సలీమ్, కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, ముస్లీం నాయకులు గని, జానీ, మహీబుల్లా, ఖలీల్, సయ్యద్ హుస్సేన్, కరీముల్లా, ఎస్‌డీఆర్, సుభానీఖాన్,ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలు



నందిగామలో మంచంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీ కవిత

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణ డాక్టర్ యు.శ్రీలక్ష్మకవిత బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 164 మందికి పరీక్షలు చేయగా జనరల్ ఓపి 42 మంది, హైపర్ టెన్షన్ 33 మంది, డయాబెటిస్ 20 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబేటీస్ 50 మంది, గర్భిణీలు 10 మంది, బాలింతలు నలుగురు, ఎనీమియ ఐదుగురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సంపూర్ణదేవి, ఎమ్ఎల్‌హెచ్‌పీ ఆరుద్ర గణేష్, ఏఎన్ఎమ్ డీ.జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ షేక్ సుభాని, డిఇఓ కె.సుధాకర్, ఆశా కార్యకర్తలు టీ.కమలకుమారి,డీ.శ్రీదేవి, తదితరులు ఉన్నారు. అలాగే రెంటపాళ్ళ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా డాక్టర్ సాయి తేజారెడ్డి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 331 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో జనరల్ ఓపి 28 మంది, హైపర్ టెన్షన్ 114 మంది, డయాబెటిస్ 52 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబేటీస్ 93 మంది, గర్భిణీలు 27 మంది, బాలింతలు ఐదుగురు, జ్వరం కేసులు ముగ్గురు, బెడ్‌రైడెన్ ముగ్గురు, చిన్నారులు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సైపర్‌వైజర్లు పీ.మంజులామార్గరేట్,ఎమ్.వెంకటేశ్వర్లు, ఏఎస్ఎమ్ జి.కోటేశ్వ రమ్మ, హెల్త్ అసిస్టెంట్ జె.బాబు, డీఇఓ జి ఇబ్రాయిల్, ఆశా కార్యకర్తలు పీ.రాధా కుమారి, పీ.పద్మజా, జీ.సీతమ్మ, షేక్ ఖాశింబి, తదితరులు ఉన్నారు.

ఇరుకుపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పాల్గొని 129 మందికి వైద్యసేవలందించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి వైద్యసేవలందించి మందులను అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఈఓ రవితేజ, సీహెచ్‌ఓ శిరీష, ఎంపీహెచ్ఎస్ కరిముల్లా, ఏఎన్ఎమ్ శాంతి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో యజ్ఞ సినిమా షూటింగ్



చిత్రంలోని షూటింగ్ సన్నివేశాలు

సత్తెనపల్లి: ఆర్ ఆర్ మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై చిలుకోటి రఘురామ్, సహ నిర్మాత చిల్లపల్లి విఠల్ గౌడ్, కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న హారర్, హాస్యం , లవ్, సెంటిమెంట్ కథతో ‘యజ్ఞ’ చిత్ర పతాక సన్నివేశాలను బుధవారం సత్తెనపల్లి పరిసరాల్లో చిత్రీకరించారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం చిత్తజల్లు ప్రసాద్, ఐటెం సాంగ్ డాన్సర్ గా సునీత (జ్యూసీ) నటించింది. సత్తెనపల్లికి చెందిన వల్లెం చెన్నకేశవ నాయుడు ప్రతి నాయకుడిగా అద్భుతంగా నటించారని దర్శకుడు తెలిపారు. జాని, అహ్మద్, మహమ్మద్, తిరుపతి, అశోక్ నాయుడు, నాగరాజు, యస్.కె.సుభాని, పాట సన్నివేశాల్లో నటించారు. ఈ చిత్రంలో హీరో గా చిలకలూరి పేట శివ, ద్వితీయ హీరోగా గురజాల రామకృష్ణ నటించారు. గద్ద సీతారామ చౌదరి వ్రాసిన ఐటమ్ సాంగ్ ‘వీధంతా ఈల ఈల, ఊరంతా గోల గోల, వామ్మో..వాయ్యో.. గోల’ ఈ పాట చిత్రీకరణ సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో జరిగిందని, ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. కెమెరా సుధాకర్ నాయుడు, సంగీతం లక్ష్మణ్ సాయి, మేకప్ శ్యామ్, ఫైట్స్ హుస్సేన్ భాయ్, పిటిపి విజన్ స్టూడియోస్, సుభాష్ రావ్ దేశ్ పాండే (దొర), కో డైరెక్టర్ మార్కాపురం దేవకి మురళీ కృష్ణ వ్యవహరించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 15వ తేదీన విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయని నిర్మాత రఘురామ్ తెలిపారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఈనెల 12న పెదకూరపాడు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనను వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు విజయవంతం చేయాలని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు పిలుపు నిచ్చారు. బుధవారం క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అమరావతి, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ తొలిసారి నియోజకవర్గానికి వస్తున్నందున ఘనంగా స్వాగతం పలకాలని సూచించారు. ప్రతి ఒక్కరు సీఎం పర్యటను విజయవంతం చేయాలని సూచించారు. నాలుగేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డామన్నారు. దాని ఫలితమే జగన్ పర్యనటలో చేపట్టబోయో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో సీఎం జగన్ పర్యటన ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దశాబ్దాలుగా తీరని అమరావతి, బెలంకొండ డబుల్‌లేన్ రోడ్డును సీఎం జగన్‌సహకారంతో నిర్మించబోతున్నామన్నారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణంతో నియోజకవర్గ రూపురేఖలు మారతాయన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి పార్టీ జిల్లా కార్యదర్శి మంగిసెట్టి కోటేశ్వరరావు,క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, కోట హరిబాబు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.